## క్రైమ్ కథ

# క్రిమినల్ బ్రెయిన్



ఖుద్దూస్ గబగబా నడిచి సికింద్రాబాద్ రైలు స్టేషన్ దగ్గరకు వచ్చాడు. తను చెయ్యదల్చుకున్నదేమిటో అతను ముందుగానే నిర్ణయించుకున్నాడు కాబట్టి కుడివైపున ఆగివున్న సిటీబస్సు దగ్గరకు వచ్చి నిల్చుని లోపలకు చూశాడు. ఖాళీగా వుంది. లోపల ఎవ్వరూ లేరు. అతను నవ్వుకుని హుషారుగా బస్సులోకి ఎక్కాడు. ఖుద్దూస్ సరిగ్గా అలాంటి బస్సునే కోరుకున్నాడు. ఆడవాళ్ళు కూర్చునే సీట్లవైపుకు వెళ్ళి ప్యాంటు జేబులో చెయ్యిపెట్టి ఒకసారి అటూ ఇటూ చూశాడు. ఎవరూ రావడంలేదని నిర్ధారించుకుని జేబులోనుంచి గుర్రపు నాడా లాంటి ఇనుప ముక్కను బయటకు తీశాడు. దానిమీద చిన్నచిన్న ముళ్ళలాంటివి పొడుచుకు వచ్చాయి.

ఆ బస్సు చాలా పాతదిలా వుంది. బస్సులో కొన్ని సీట్లు మరీ పాతబడిపోయి, పైన కవరు కొంతవరకు చినిగి లోపలి స్పాంజి బయటకు కనపడుతోంది.

ఖుద్దూస్ ఒక సీట్లో కూర్చుని ముందుకు వొంగి ముందు సీటుమీది కవరులోకి చేతిని పోనిచ్చి ఆ నాడా లాంటి ముళ్ళ ఇనుప ముక్కను లోపలపెట్టి సీటు కవరును దానిమీద కనపడకుండా మళ్ళీ మామూలుగా సర్దేశాడు.

అప్పుడు అక్కడినుంచి లేచి వెళ్ళి మగవాళ్లు కూర్చునే ఓ సీటులో కూర్చుని బయటకు చూశాడు. అప్పుడే డ్రయివరూ, కండక్టరూ సిగరెట్లు కాలుస్తూ వచ్చి బస్సులోకి ఎక్కారు.

బస్సు స్టార్టయింది.

వెంటనే ముగ్గురు ఆడవాళ్లు వచ్చి ఎక్కి డ్రయివర్ వెనుకవైపు వున్న సీట్లో

కూర్చున్నారు. తను కోరుకున్న సీట్లో వాళ్లు కూర్చోనందుకు ఖుద్దూస్ నిరుత్సాహపడ్డాడు. తర్వాత కొంతమంది మగవాళ్లు ఎక్కి వాళ్ల సీట్లలో కూర్చున్నారు.

బస్సు ఖాళీగా బయల్దేరడం ఖుద్దూస్‌కు ఇష్టంలేదు. కొంచెంసేపు అక్కడే వుంటే ఎవర యినా ఎక్కే అవకాశం వుంది. అతను ఇలా అను కుంటున్నప్పుడు బస్‌స్టేషన్ ఆవరణలోనుంచి బయటకు వచ్చి కుడివైపునకు తిరుగుతున్న ప్పుడు ఒక పాతికేళ్ల యువతి గబగబా బస్సుకు ఎదురు వచ్చి చెయ్యెత్తి ఆపమని సైగ చేసింది.

ఆమెవైపు క్యూరియస్‌గా చూశాడు ఖుద్దూస్. అతడి వేళ్ల మధ్య సిగరెట్ వెలుగుతోంది.

బస్సు ఆగింది. వెనుక డోర్‌నుంచి బస్సులో ఎక్కి ఖుద్దూస్‌ను దాటివెళ్లి పూర్తిగా ఖాళీగా వున్న సీటు మధ్యలో కూర్చుని కెవ్వున అరిచి నిలబడింది.

ఆగిపోయింది బస్సు.

''ఏం జరిగింది?'' లేచి నిల్చుంటూ అడి గాడు కండక్టరు.

ఆ యువతి జవాబు చెప్పకుండా కుడిచేత్తో తన నడుము కింద భాగాన్ని తడిమి సీటు మీద చూసింది.

ఖుద్దూస్ నవ్వును ఆపుకుని ''మేడమ్... ఏమ య్యింది?'' అనడిగాడు సిగరెట్టు పొగ వదు లుతూ.

''ఏదో గుచ్చుకుంది'' చెప్పిందామె భయంగా. ఆమె కొంచెం లావుగా, పొడవుగా, దండిగా, నిండుగా వుంది. అయినా మేనిలో నాజూకుతనం, నిగారింపు వున్నాయి.

''నేను చూస్తాను'' అని ఖుద్దూస్ లేచి వచ్చి ఆమె కూర్చున్న సీటుమీద తడిమి ''లోపల ఏదో వుంది'' అన్నాడు.

అప్పటికే అక్కడకు వచ్చిన కండక్టర్ కవరు లోపలకు చేతిని పోనిచ్చి ఆ నాడాలాంటి ఇనుప ముక్కను బయటకు తీసి ''ఇది ఇక్కడకు ఎలా వచ్చింది?'' అని అడిగాడు ఆశ్చర్యంగా.

''ఎవరో పెట్టివుంటారు'' అన్నాడు ఖుద్దూస్ దాన్ని చేతిలోకి తీసుకుని అటూఇటూ తిప్పి చూస్తూ.

''ఎవరై వుంటారు?'' ఆ యువతి అడిగింది. ఇంకా రెండు చేతులతో వెనుకభాగాన్ని రుద్దు కుంటూ.

''ఎవరికి తెలుసు. బ్లడ్ కూడా వస్తున్న ట్టుంది. త్వరగా ఇంటికి వెళ్లండి'' అన్నాడు ఖుద్దూస్ ఆమె చీర మీద వున్న ఎర్రటి తడిని చూసి.

''ఇంటికే వెళుతున్నాను. ఈ బస్సు ఇప్పుడు కదులుతుందా?''

ఆ మాట విని డ్రయివర్ బస్సును స్టార్ట్ చేశాడు.

ఇంకోసారి సీటును తడిమి చూసుకుని కూర్చుంది ఆ యువతి.

ఖుద్దూస్ తన సీట్లో కూర్చుని ఇంకో సిగరెట్టు ముట్టించాడు.

***

సాధారణంగా ఆ వీధిలో జనసంచారం అంతగా ఉండదు. ఆ వీధి పక్కనే రైలుపట్టాలు వున్నాయి. ఎవరయినా రైలు పట్టాలు దాటి అవ తలి వైపుకు వెళ్లేవాళ్లు ఆ వీధిలోకి వస్తారు. పక్క వీధిలో వున్న ఇళ్ల వెనుకవైపు వాకిళ్లు నిర్జనంగా వుండే ఆ వీధిలోకి వుంటాయి.

రాత్రి ఎనిమిది గంటలు అవుతోంది. ఖుద్దూస్ రైలు గేటు పక్కనే వున్న బడ్డీకొట్టు దగ్గర నిలబడి వున్నాడు. అతడి చూపు ఆ వీధి మీదకు వుంది. అతడు ఆ బడ్డీకొట్లో సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె కొని ఒక సిగరెట్టు ముట్టించి ఆ వీధిలోకి వచ్చే మనుషులకోసం చూస్తున్నాడు.

ఉన్నట్టుండి అతడి కళ్లు మెరిశాయి. ఆ రోడ్డు చివరినుంచి ఓ అమ్మాయి ఎడమ చేత్తో పుస్తకాలు పట్టుకుని గబగబా నడిచివస్తోంది. అక్కడ వీధి దీపం వెలుగుతోంది.

ఖుద్దూస్ ఏదో అర్జంటు పని వున్నవాడిలా గబగబా ఆ వీధిలోకి నడిచాడు.

రైలు పట్టాల పక్కనే పొడవుగా, ఎత్తుగా వున్న గోడ వుంది. పట్టాలు దాటి అవతలివైపుకు వెళ్లడంకోసం ఆ గోడను కొన్నిచోట్ల కొంతమేర పగలకొట్టారు.

వేగంగా నడిచి ఆ అమ్మాయికి ఎదుర య్యాడు ఖుద్దూస్. అక్కడ చీకటిగా వుంది. వీధి దీపం వెలగటం లేదు. ఇంకెవ్వరూ లేరు.

''శ్యామలా'' అని పిల్చాడు ఖుద్దూస్, ఆ అమ్మాయిని దాటుతున్నప్పుడు.

''నా పేరు శ్యామల కాదు. అనిత'' అన్నదా అమ్మాయి.

''ఎక్కడినుంచి వస్తున్నావ్?''

''ఇంగ్లీష్ ట్యూషన్ నుంచి'' చెప్పింది.

ఆ అమ్మాయి మెళ్లో బంగారు గొలుసు వుంది. చెవులకు పెద్దపెద్ద రింగులు వేళ్లాడుతు న్నాయి.

ఆ అమ్మాయి తిరిగి వెళ్లబోతున్నప్పుడు – ''అనితా... నీ మెళ్లో గొలుసును ఇస్తావా?'' అని అడిగాడు ఖుద్దూస్.

''ఇవ్వను'' అన్నది అనిత.

''ఎందుకని ఇవ్వవు.''

''ఇస్తే మా ఇంట్లో కొడతారు''

''ఇవ్వకపోతే నేను చంపి తీసుకుంటాను'' అంటూ జేబులోనుంచి పొడుగ్గా వున్న కత్తిని తీసి, పెదవుల మధ్య వున్న సిగరెట్టును బయ టకు తీసి దాని నిప్పును నోటితో వూది ఎర్రగా చేసి, ఆ వెలుగులో అనితకు కత్తిని చూపించాడు.

''వద్దు... నన్ను చంపొద్దు'' భయంగా అన్నది మెడలో వున్న గొలుసును తీస్తూ.

ఖుద్దూస్ నవ్వి ''ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకూడదు. ఆడుకుంటున్నప్పుడు పోయిం దని చెప్పాలి... సరేనా?'' అన్నాడు గొలుసు జేబులో వేసుకుని.

తల వూపింది అనిత.

అప్పుడు ఖుద్దూస్ చటుక్కున అనిత వెనక్కు వచ్చి కుడిచేత్తో ఆ అమ్మాయి నోరు మూసి ఎడ మచేత్తో పెదవుల మధ్య ఎర్రగా వెలుగుతున్న సిగరెట్టును తీసి దాన్ని అనిత మెడమీద వుంచి గట్టిగా నొక్కాడు.

అరుపు బయటకు రాకుండా అనిత బాధగా మూలిగింది. ఖుద్దూస్ నవ్వుకున్నాడు.

***

లోకల్ ట్రయిన్ రద్దీగా వుంది. ఎంట్రెన్స్ దగ్గర నిలబడి వున్నాడు ఖుద్దూస్. అతని పక్కనే ఒకతను ఇనుప కడ్డీని పట్టుకుని నిల్చుని బయ టకు చూస్తున్నాడు.

ఖుద్దూస్‌కు ఎవరూ లేరు. అతను చిన్నతనం నుంచీ అనాథగానే గూడ్స్‌షెడ్‌లో అనాథ పిల్లల మధ్య పెరిగాడు. ఇప్పటికీ అతను వొంటరివాడే. కేవలం చిన్నచిన్న దొంగతనాల మీద ఆధారపడి అతను బతుకుతున్నాడు.

ఏదో స్టేషన్లో రైలు ఆగింది. ఖుద్దూస్‌ను నెట్టు కుని సన్నగా, పొడవుగా వున్నతను లోపలకు ఎక్కి ఖుద్దూస్‌కు వెనగ్గా నిలుచున్నాడు. లోతుగా వున్న కళ్లు – అక్కడక్కడ తెల్లబడిన మీసం – పొడవాటి తల వెంట్రుకలను వెనక్కి దువ్వుకున్నాడు. పొడుగు చేతుల షర్టు – గచ్చ కాయ రంగు ప్యాంటుతో సినిమాల్లో చిన్నచిన్న పాత్రలు ధరించే ఎక్స్ట్రా నటుడిలా వున్నాడు.

రైలు కదలడంతోనే సిగరెట్టు వెలిగించాడు. ఎడమ చేతిని ప్యాంటు జేబులో పెట్టుకుని, కుడి చేతిని ఎంట్రన్స్‌పైన ఆనించి ముందుకు వొంగి దాటిపోతున్న పరిసరాలను చూస్తున్నాడు ఖుద్దూస్.

ఖుద్దూస్ వెనక నిలబడి సిగరెట్టు కాలుస్తున్న అతను ఉన్నట్టుండి సిగరెట్టును ఎంట్రెన్స్ పైన ఆనించిన ఖుద్దూస్ చేతిమీద వుంచి నొక్కాడు.

చురుక్కుమనిపించి చేతిని వెనక్కు లాక్కుని బయటకు పడబోయాడు ఖుద్దూస్. అప్పుడు అతని పక్కనే వున్న అతను ఎవరో ఖుద్దూస్‌ను పడిపోకుండా ఆపాడు.

ఖుద్దూస్ వెనక్కు తిరిగి తన వెనుక నిల్చున్న మనిషిని ఆశ్చర్యంగా చూశాడు.

అప్పుడు ఆ సన్నగా వున్న మనిషి ఖుద్దూ స్‌కు కొంచెం దగ్గరగా జరిగి ఖుద్దూస్‌కు మాత్రమే వినిపించేట్టు నవ్వుతూ ఇలా అన్నాడు –

''నీ గురించి నాకు బాగా తెలుసు. నీలాంటి మనుషులు ఈ సమాజంలో ఇంకొంతమంది వుంటారని తెలుసుకో. చిన్నచేపలను మింగే పెద్ద చేపలు ఎప్పుడూ ఉంటాయి''.

భయమంటే తెలియని ఖుద్దూస్ – సన్నగా, రివటలా వున్న ఆ మనిషి కళ్లలోకి భయంగా చూశాడు.

– ప్రతాప రవిశంకర్